APTEL/2015/65279

Postal Reg.No. MPM/L22/VNEWS/22-24

# V న్యూస్

మన ఊరు - మన వార్తలు

తెలుగు దినపత్రిక


e-mail : vnewsmachilipatnam@gmail.com
e-mail : vnewsindia@gmail.com

సంపుటి :9 సంచిక : 222 మచిలీపట్నం, విజయవాడ, కాకినాడ, గుంటూరు, ఖమ్మం, వైఎస్ఆర్ కడప, ఒంగోలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు 17-01-2023 మంగళవారం పేజీలు :4 వెల : రూ.3/-













# సాయుధ దళాల్లో అగ్నివీరులే కీలకం : ప్రధాని మోదీ



**దిల్లీ :** సరికొత్త 'అగ్నిపథ్' పథకానికి మార్గనిర్దేశకులు మీరేనని త్రివిధ దళాల తొలి బ్యాచ్‌హౌఅగ్నివీరులకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఈ పరివర్తన విధానం సాయుధ బలగాలను పటిష్ఠం చేయడంలో కీలకంగా మారుతుందని, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు వారిని సిద్ధంగా ఉంచుతుందని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని మోదీ సోమవారం అగ్నివీరుల తొలి బ్యాచ్‌నుద్దేశించి మాట్లాడారు. యువ అగ్నివీరులు సాయుధ దళాలను మరింత యువోత్సాహం, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన శక్తిగా మారుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

'నవ భారతం నూతన శక్తితో నిండి ఉంది. మన బలగాలను ఆధునికీకరించడంతోపాటు వాటిని ఆత్మనిర్భర్‌గా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. 21వ శతాబ్దంలో యుద్ధాల తీరు మారుతుంది. సాంకేతికంగా ముందంజలో ఉండే సైనికులదే సాయుధ దళాల్లో ముఖ్య భూమిక. ప్రస్తుత తరానికి ఈ సామర్థ్యం ఉంది. కాబట్టి.. సైన్యంలో అగ్నివీరులు కీలక పాత్ర పోషిస్తారు' అని ప్రధాని మోదీ అన్నారు. ఈ సందర్భంగా అగ్నివీరుల సామర్థ్యాన్ని కొనియాడుతూ, వారి స్ఫూర్తి.. సాయుధ బలగాల ధైర్యసాహసాలను ప్రతిబింబిస్తోందన్నారు. అగ్నివీరులుగా పొందే అనుభవం జీవితానికి గర్వకారణంగా ఉంటుందని తెలిపారు.

అగ్నిపథ్ పథకం మహిళలకు మరింత సాధికారత కల్పిస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. త్రివిధ దళాల్లో మహిళా అగ్నివీరులను చూసేందుకు తాను ఎదురుచూస్తున్నానన్నారు. 'భిన్న ప్రదేశాల్లో విధుల నేపథ్యంలో.. అక్కడి సంస్కృతితో మమేకం కావాలి. సమష్టిగా పని చేయడంతోపాటు ఎంచుకున్న రంగాల్లో నైపుణ్యాలను, నాయకత్వ లక్షణాలను మెరుగుపర్చుకోవాలి. కొత్త విషయాలను నేర్చుకోవడంలో ఆసక్తి చూపాలి' అని అగ్నివీరులకు సూచించారు. దేశ యువత, అగ్నివీరుల శక్తిసామర్థ్యాలను ప్రస్తావిస్తూ.. 21వ శతాబ్దంలో దేశానికి నాయకత్వం అందించనుంది వీరేనని ప్రధాని కొనియాడారు. ఇదిలా ఉండగా.. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 25 వేలకు పైగా అగ్నివీరులు శిక్షణ పొందుతున్నారు.


## రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో 'రాయల'పాలన

### 'చెరువుల అభివృద్ధి చారిత్రాత్మకం'

### - ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

**అమరావతి :** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 68 చెరువుల అభివృద్ధితో పుష్కలంగా నీరందించే కార్యక్రమం ..చారిత్రాత్మకమని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. ఒక్క డోన్ నియోజకవర్గంలో 30 చెరువులు, గుంటల అభివృద్ధితో 25 గ్రామాలకు సాగు నీరు అందించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలీ మండలంలో ఆర్థిక మంత్రి రెండో రోజూ పర్యటించారు. డోన్ వ్యాప్తంగా వెంకటాపురం, మల్లెంపల్లె, జగదుర్తి, ఉడుములపాడు చెరువులను, రెండో రోజు మెట్టుపల్లి సహా పలు గ్రామాలను సందర్శించి ట్రయల్ రన్ ను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పర్యవేక్షించారు.వర్షాలతో ఆధారపడకుండా గోరుకల్లు నుంచి శాశ్వత తాగునీరు, సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వాల హయాంలో నీటిపారుదల కింద ఎకరం కూడా నోచుకోని డోన్ నియోజక వర్గం త్వరలోనే చెరువుల నిండా నీటితో కళకళలాడనున్నాయన్నారు.

ప్రజలు తనకిచ్చిన అవకాశం..ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూపంలో దొరికిన అదృష్టం వల్లనే ఇదంతా సాధ్యమైందని మంత్రి పేర్కొన్నారు.రూ.360 కోట్లతో హంద్రీ–నీవా ప్రధాన కాల్వ నుంచి జిల్లాలో 68 చెరువులకు నీరు మళ్లించే పనులు తుది దశకు చేరినట్లు వివరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరువు ప్రాంతాలను



సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం చేపట్టిన హంద్రీనీవా నీటిని చెరువులకు మళ్లింపు పథకం పూర్తయిందని త్వరలోనే దీన్ని సీఎం చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రాథమిక దశలో డోన్ నియోజకవర్గం లోని 8 చెరువుల ద్వారా నీటి మళ్ళించి రైతుల సాగునీటి కష్టాలు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నారు.

డోన్ లో ఏర్పాటు చేయనున్న పాఠశాల, కళాశాలలో ఆడపిల్లలకు ప్రత్యేకంగావసతులకు పెద్దపీట వేయనున్నట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన 3 నెలల్లో ఆలూరు, పత్తికొండ, డోన్, కర్నూలు ప్రాంతాల్లోని ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించిన 68 చెరువుల అభివృద్ధికోసం కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. గంటన్నర సమయం పట్టే పరిస్థితి నుంచి అరగంటలో గమ్యం చేరేలా రహదారులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కృష్ణగిరి మండల పరిధిలోని పులిచెర్ల కొండపై ఏర్పాటు చేసిన డెలివరీ చాంబర్ నుంచి మూడు గ్రావిటీల ద్వారా చెరువులకు నీరు మళ్లించే మెయిన్ పైప్ లైన్ పనులు త్వరలోనే పూర్తికానున్నట్లు మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే నీటి మళ్లింపునకు చేపట్టిన ట్రయల్ రన్ విజయవంతమైందన్నారు. చనుగొండ్ల, వెంకటాపురం, యాపదిన్నె, అబ్బిరెడ్డిపల్లె, మల్లెంపల్లె,జగదుర్తి, ఉడుములపాడు, దేవరబండ చెరువులను హంద్రీనీవా నీటితో నింపే కార్యక్రమాన్ని త్వరలో సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి బుగ్గన స్పష్టం చేశారు.

## ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేసిన సుప్రీంకోర్టు

**దిల్లీ :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ జస్టిస్ ఎంఆర్ షా నేతృత్వంలోని ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. "బెయిల్ రద్దు పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు నిర్ణయం తీసుకుంటుంది. వివేకా హత్య కేసు విచారణను ఇప్పటికే సుప్రీంకోర్టు తెలంగాణకు బదిలీ చేసింది. గంగిరెడ్డి బెయిల్ రద్దుపై కూడా తెలంగాణ హైకోర్టే నిర్ణయిస్తుంది. గతంలో బెయిల్ మంజూరు చేసినప్పుడు మెరిట్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. ఇప్పుడు తెలంగాణ హైకోర్టు అన్ని అంశాలను పరిశీలించి బెయిల్ రద్దుపై నిర్ణయం తీసుకోవాలి"



అని ధర్మాసనం వెల్లడించింది.

దర్యాప్తులో భాగంగా ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎంఆర్ షా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. "వివేకా హత్య కేసును ఏపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నప్పుడు.. సరైన సమయంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయకపోవడంతో గంగిరెడ్డికి బెయిల్ వచ్చింది. దర్యాప్తు సీబీఐ చేతికి వచ్చిన తర్వాత అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వాటి ఆధారంగా గంగిరెడ్డికి బెయిల్ రద్దు చేయాలన్న మా విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది" అని సీబీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. అయితే, విచారణకు గంగిరెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని.. బెయిల్ రద్దు చేయాల్సిన అవసరం లేదని ఆయన తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువురి వాదనలు విని తీర్పును వాయిదా వేసిన ధర్మాసనం.. తాజాగా పిటిషన్‌పై విచారణను తెలంగాణ హైకోర్టుకుహౌబదిలీ చేస్తూ తీర్పు ఇచ్చింది.


## ఏపీ మంత్రి పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డికి త్రుటిలో తప్పిన ప్రమాదం

**రాయచోటి :** అన్నమ య్య జిల్లా రాయచోటి మండలం చెన్నముక్క పల్లె రింగ్ రోడ్డు వద్ద ఏపీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అతడి కుమారుడు ఎంపీ మిథున్‌రెడ్డిలకు తృటిలో ప్రమాదం తప్పింది. బంధువుల ఇంటికి వెళ్తుండగా కాన్వాయ్ లోని ఎంపీ మిథున్‌రెడ్డికి చెందిన వాహనాన్ని మరో కారు ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో ఆ వాహనం పల్టీలు కొట్టింది. వాహనంలో



ప్రయాణిస్తున్న ఎంపీ వ్యక్తిగత కార్యదర్శి, భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులంతా సంక్రాంతి వేడుకల్లో పాల్గొనేందుకు పుంగనూరు నుంచి వీరబల్లిలోని అత్తగారింటికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అయితే మంత్రి వాహనంలోనే ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి కూడా ఉ ండటంతో వాళ్లకు ప్రమాదం తప్పింది.

## పెద్దిరెడ్డి పనైపోయింది.. బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం : చంద్రబాబు నాయుడు



**అన్నమయ్య:** 'తెదేపా ఫ్లెక్సీలు ఎందుకు చింపారని ప్రశ్నిస్తే కేసులు పెడతారా?' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. అన్నమయ్య జిల్లా పీలేరు సబ్ జైలులో ఉన్న పుంగనూరు తెదేపా నేతలు, కార్యకర్తలను ఆయన సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు ఆయన వెంట తరలివచ్చారు. వారిని పరామర్శించిన అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.

"ఏం తప్పు చేశారని తెదేపా కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తున్నారు. అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా కొడతారా? తప్పు ఒప్పుకోవాలని ఒత్తిడి చేస్తారా? సీఐ, ఎస్సై చాలా దారుణంగా వ్యవహరించారు. భయపెట్టి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. నన్ను పీలేరు రాకుండా అడ్డుకుంటారా? నేనెక్కడికి వస్తే అక్కడ పోలీసు యాక్టు 30 పెడతారా? ఎంతమందిని జైల్లో పెడతారో మేమూ చూస్తాం. అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదు. పోలీసులూ.. ఇకనైనా పద్ధతి మార్చుకోండి. పెద్దిరెడ్డి పనైపోయింది.. బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని చంద్రబాబు అన్నారు.

**సబ్‌జైలు వద్ద ఆందోళన**

అన్యాయంగా తమ వారిపై కేసులు పెట్టారని పీలేరులో మహిళలు ఆందోళనకు దిగారు. ఫ్లెక్సీల గొడవలో తమ వారికి సంబంధం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హత్యాయత్నం కేసులు పెట్టి తమవారిని వేధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు పీలేరు సబ్ జైలు వద్ద చంద్రబాబుతో మాట్లాడుతుండగా.. పర్వీన్ అనే మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

## కొలీజియంలో ప్రభుత్వాన్ని చేర్చండి.. సీజేఐకి కిరణ్ రిజిజు లేఖ

**దిల్లీ :** న్యాయమూర్తుల నియామకాల వ్యవహారంలో సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వానికి మధ్య కొన్ని రోజులుగా విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియలో.. హైకోర్టు, సుప్రీంకోర్టు కొలీజియంల్లో ప్రభుత్వ ప్రతినిధులను చేర్చుకోవాలంటూ కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు.. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్‌కు లేఖ రాశారు.

న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన రాజ్యాంగ ప్రక్రియలో ప్రభుత్వ ప్రతినిధులకు చోటు కల్పించాలని రిజిజు ఈ సందర్భంగా సూచించారు. జడ్జీల నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం గురించి ప్రజలకు తెలియజేయడం అవసరమని ఆయన లేఖలో పేర్కొన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

ప్రస్తుతం దేశంలో న్యాయమూర్తులను నియమిస్తున్న కొలీజియం వ్యవస్థ రాజ్యాంగానికి అతీతమన్నట్లు



ఇటీవల కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలతో కేంద్రం, సుప్రీంకోర్టు మధ్య అభిప్రాయభేదాలు మొదలైన విషయం తెలిసిందే. న్యాయస్థానాల్లో కొండల్లా పేరుకుపోయిన కేసులకు కొలీజియం వ్యవస్థే కారణమన్నట్లుగా కేంద్రమంత్రి వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ఇటీవల ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడుతూ.. 2014లో తెచ్చిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ)ని కొట్టేయడం ద్వారా ప్రజలెన్నుకున్న పార్లమెంటు సార్వభౌమత్వాన్ని సుప్రీంకోర్టు తోసిపుచ్చిందని విమర్శించడం ఈ వివాదాన్ని మరింత తీవ్రం చేసింది. అయితే ఈ విమర్శలకు సుప్రీంకోర్టు కూడా దీటుగా బదులిచ్చింది. కొలీజియం నచ్చకపోతే ఇంకో వ్యవస్థను తీసుకురావాలని కేంద్రంపై అసహనం వ్యక్తం చేసింది.

# క్రాంతి -సంక్రాంతి

'అగ్రికల్చర్ ఈజ్ అవర్ కల్చర్' అని గర్వంగా చెప్పు కునే జాతి మనది. వ్యవసాయం మన జీవన విధానం అనే నానుడి కూడా ఉన్నది. వ్యవసాయేతర వృత్తులు కూడా ఒకనాడు వ్యవసాయానికి అనుబంధంగానో, దాని చుట్టూనో అల్లుకున్నవే కావడం ఈ నానుడికి కారణం. కనుకనే మన జీవన గమనంలో ఇప్పటికీ అడుగడుగునా వ్యవసాయ సంస్కృతి తొంగి చూస్తున్నది. పలకరిస్తున్నది. ఆటలో, పాటలో, పలకరింపులో, వేడుకలో, వంటలో, విందులో, పండుగలో... ఇలా ప్రతి ఉత్సాహంలో, ఉద్వేగంలో, ఉత్తేజంలో వెన్నంటే నడుస్తున్న మన మేనిఛాయ వ్యవసాయం.

వ్యవసాయ జీవితపు శిరస్సుపై ప్రకృతీ, పర్యా వరణాలు అందంగా అలంకరించిన శిరోభూషణం -పట్టుకుచ్చుల పంచరంగుల తలపాగా సంక్రాంతి పండుగ. ఈ పండుగ హరిదాసులు పాడే ఒక పాట. గాలిపటాలు, కోడి పుంజుల ఆట. రంగవల్లుల రంగుల చిత్రం. గొబ్బెమ్మల ఆరోగ్య తంత్రం. తృప్తిపడిన జీవి తపు నర్తనోత్సవం. ఒక్క మానవ జీవితపు ఉల్లాసమే కాదు... సమస్త ప్రకృతి పర్యావరణ శక్తుల సమష్టి సెలబ్రేషన్ సంక్రాంతి.

దేశంలోని ప్రధాన వ్యవసాయాధార రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఇప్పటికీ ఎక్కువమంది ప్రజలు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యవసాయరంగంపై ఆధారపడుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైనది. వ్యవసాయ అనుబంధ రంగాలు రాష్ట్ర సంపదకు చేర్చుతున్న వాటా కూడా దేశ సగటుతో పోలిస్తే ఎక్కువే. మకర సంక్రాంతి పండుగ వైభవం కూడా ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువ. ఇక్కడే ఇప్పుడు సంక్రాంతి శోభతో ముడిపడిన ఒక రాజకీయ యుద్ధమేఘం ఆవహించి ఉన్నది. సంక్రాంతి స్ఫూర్తిని రగిలించే రాజకీయం ఒకవైపు, దహించే రాజకీయం ఒకవైపు మోహ రించి ఉన్నాయి.

ప్రజా జీవితాల్లోకి పాలనా కాంతుల సంక్రమణం చేయించిన సంక్రాంతి రాజనీతి ఒకవైపు – ఆ క్రాంతిని కబళించాలని చూస్తున్న రాహు, కేతు పన్నాగం మరో వైపూ నిలబడి తలపడేందుకు సిద్ధపడుతున్నాయి. ముక్కారు పంటలతో అలరారిన ముప్పై మూడువేల ఎకరాల హరితావరణాన్ని బీడుగా మార్చి, ప్రకృతి గుండెల్లో కాంక్రీట్ గునపం గుచ్చాలని చూస్తున్న రాజకీయ పెత్తందార్లు ఒకపక్కన నిలబడ్డారు. ప్రతి పల్లెకూ పట్టాభిషేకం చేసి రాజధానిగా గౌరవించి, పంట చేనుకూ, రైతుబిడ్డకూ రాచ మర్యాదను కల్పించిన ప్రజానాయకుడు మరోపక్కన నిలబడ్డాడు. తల్లీ సంక్రాంతీ, పుష్యలక్ష్మీ నీవే తీర్పు చెప్పాలి!

జంధ్యాల పాపయ్యశాస్త్రి రచించిన అజరామర కావ్యం 'పుష్పవిలాపం' గుర్తుకొస్తున్నది. "నేనొక పూలమొక్క కడ నిల్చి, చివాలున కొమ్మ వంచి గోరా నెడు నంతలోన విరులన్నియు జాలిగ నోళ్లు విప్పి 'మా ప్రాణము తీతువా' యనుచు బావురుమన్నవి,కృంగిపోతి" అంటాడు. బావురుమనడమే కాదు, చివర్లో ఆ పూమొగ్గలన్నీ మనుషుల్ని శపించాయని కూడా అంటాడు. 'ఓయీ మానవుడా... బుద్ధదేవుని భూమిలో పుట్టినావు, సహజమగు ప్రేమ నీలోన చచ్చెనేమి? అందమును హత్యచేసెడి హంతకుండ! మైలపడిపోయె నోయి నీ మనుజ జన్మ' అన్నాయట! పాపయ్యశాస్త్రి సొంత జిల్లా గుంటూరులోనే ముప్పై మూడు వేల ఎకరాలను బీడు చేసినప్పుడు ఎన్ని లక్షల పూబాలలు ఎన్ని రకాల శాపనార్థాలు పెట్టి ఉంటాయో!

మన పెత్తందార్ల ముఠామేస్త్రీ చంద్రబాబును ఇప్పుడు కొందరు 'బోల్సోనారో ఆఫ్ ఆంధ్రా' అని పిలుస్తున్నారు. నిజానికి అలా పిలవడం తప్పు. బోల్సోనారోనే 'చంద్రబాబు ఆఫ్ బ్రెజిల్'గా పిలవాలి. ప్రపంచవ్యాప్తంగా ఉండే పెత్తందార్లందరూ అభివృద్ధి పేరుతో ముద్దుగా పిలుచుకునే దోపిడీ మోడల్‌ను అనుసరించడంలో బోల్సోనారో కంటే చంద్రబాబు ఇరవయ్యేళ్లు సీనియర్. ఈ మధ్యకాలంలో అపు రూపమైన అమెజాన్ అడవులను వందల కిలోమీటర్ల పర్యంతం నరికివేసి, ప్రాణవాయువును సైతం లూటీ చేయడానికి తెగబడిన ఘనుడు బోల్సోనారో. ఎన్నికల్లో ఓడిపోయినా ఒప్పుకోకుండా కబ్జాకోరుతనంతో కాలు దువ్వి 'ట్రంపరి'తనాన్ని ప్రదర్శించడాన్ని కూడా ప్రపంచం గమనించింది.

అటువంటి బోల్సోనారోలకు గురుపాదులు మన బాబు. వీరి అభివృద్ధి మోడల్ సిద్ధాంతం ప్రకారం డబ్బే పెట్టుబడి. అధికారం దానికి అండ. ఈ రెండూ ఉన్న వారు సమస్త సహజ వనరుల్నీ, మానవ శ్రమనూ యథేచ్ఛగా దోపిడీ చేయవచ్చు. నదుల్ని కలుషితం చేయవచ్చు. కొండల్ని పిండి చేయవచ్చు. అడవుల్ని నరికేయవచ్చు. కాంక్రీట్ అరణ్యాలను నిర్మించవచ్చు. మానవ శ్రమను, మేధను కారుచౌకగా కొనేయవచ్చు. ఫలితంగా ఇబ్బడి ముబ్బడిగా సంపద సృష్టి సాధ్యమవుతుంది. ఈరకంగా అభివృద్ధి సాధిద్దామంటారు మన బాబులు, ప్రపంచవ్యాప్తంగా ఉండే వారి బాబులు కూడా!

ఇది అమానవీయమైన అభివృద్ధి అనే విమర్శలు చాలాకాలంగా ఉన్నాయి. ఇందుకు ప్రత్యామ్నాయంగా చాలా నమూనాలు ముందుకొస్తున్నాయి. సుస్థిర అభివృద్ధి నమూనా ఒకటి. మానవ వికాసానికి అవసరమైన మేరకు సహజ వనరుల్ని హేతుబద్ధంగా వాడుకొని వాటిని భవిష్యత్ తరాల అవసరాలకోసం కూడా మిగిల్చే పద్ధతులను ఈ నమూనా అనుసరిస్తుంది. మానవ శ్రమను, మేధను వనరులుగా కాక పెట్టుబడి గానే గుర్తించాలన్న ఆలోచనలు కూడా ముందుకు వస్తున్నాయి. వీటి సారాంశం ఒక్కటే – ఈ ప్రపంచం అందరిదీ, సమస్త జీవరాశిది. ఈ తరాలకే కాదు భవిష్యత్తు తరాలకు కూడా చెందినది. మానవ జాతి సమష్టిగా సృష్టించుకునే సంపద కూడా అందరికీ చెందినది. సంపద సృష్టి –పంపిణీ హేతుబద్ధంగా ఉండాలి. ఇది ప్రజాహితమైన, పర్యావరణ హితమైన అభివృద్ధి మోడల్. ఈ రెండో రకమైన అభివృద్ధిలోనే నిజమైన జనక్రాంతి ఇమిడి ఉన్నది. అసలైన సంక్రాంతి దాగి ఉన్నది. ఈ సంక్రాంతికి సంకెళ్లు వేయాలంటుంది బోల్సోనారో –బాబు అభివృద్ధి మోడల్. ఈ సంక్రాంతులు జనజీవితమంతా పరుచుకోవాలంటుంది ప్రత్యామ్నాయ అభివృద్ధి మోడల్. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి మోడల్‌కు చంద్రబాబు, రెండో మోడల్‌కు ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరమే లేదు. వారిద్దరి విధాన నిర్ణయాల బేరీజుతోనే ఈ అంచనాకు రావచ్చు.

వేల ఎకరాల్లో విస్తరించిన పచ్చందనాలకు ఉరి బిగించే చంద్రబాబు అభివృద్ధి నమూనాను వైఎస్ జగన్ తిరస్కరించారు. రాజధాని వికేంద్రీకరణకు నడుం కట్టారు. జనసాధికారతలో వికేంద్రీకరణ అనేది తొలి అడుగు. ఆ వికేంద్రీకరణను మరింత విప్లవాత్మకం చేసి పదిహేను వేల మినీ రాజధానులను ఆయన సృష్టించారు.

# దిల్లీ వీధుల్లో.. ప్రధాని మోదీ మెగా రోడ్‌షో

**దిల్లీ :** దేశ రాజధానిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మెగా రోడ్ షో నిర్వహించారు. భాజపా కార్యకర్తలు, మద్దతు దారులు రోడ్డుకు ఇరువైపులా భారీ సంఖ్యలో నిలబడి ప్రధానికి అభివాదం తెలిపారు. దిల్లీలో రెండు రోజులపాటు జరిగే భాజపా జాతీయ కార్యవర్గ సమావేశాలకు హాజరయ్యే ముందు ప్రధానమంత్రి ఈ భారీ ర్యాలీ నిర్వహించడం విశేషం.

పటేల్ చౌక్ నుంచి మొదలై ఎన్‌డీఎంసీ కన్వెన్షన్ సెంటర్ వరకు కొనసాగిన ప్రధాని రోడ్‌షోకు విశేష స్పందన కనిపించింది. సంగీత వాయిద్యాలు, కేరింతలతో భారీ సంఖ్యలో ప్రజలు మోదీకి స్వాగతం పలికారు. ర్యాలీ సందర్భంగా మోదీపై పూలను చల్లడంతోపాటు ఆయనకు మద్దతుగా నినాదాలు చేస్తూ కనిపించారు.




రోడ్‌షో కొనసాగిన మార్గమధ్యలో పలుచోట్ల వేదికలనూ ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు జానపద నృత్యాలతో కనువిందు చేయగా.. మరికొంతమంది దేశభక్తి గీతాలను ఆలపించారు. పార్టీ సమావేశ కేంద్రం వద్ద భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రధానమంత్రికి స్వాగతం పలికారు.

ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇటువంటి రోడ్ షోలను ప్రధాని మోదీ ఎన్నో నిర్వహించారు. దిల్లీలోనూ ఇప్పటివరకు అనేకసార్లు పార్టీ కార్యవర్గ సమావేశాలు జరిగినప్పటికీ.. వాటికి ముందు ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన సందర్భాలు మాత్రం చాలా అరుదు. ఒడిశాలో పార్టీ సమావేశాలు జరిగినప్పుడు మాత్రం అక్కడ రోడ్ షో నిర్వహించారు. కార్యకర్తలు, మద్దతుదారులను ఉత్తేజపరచడంలో ఇటువంటి రోడ్ షోలు ఎంతో దోహదం చేస్తాయని పార్టీ నేతలు వెల్లడించారు.

# విమానాశ్రయం ప్రారంభించిన 15 రోజుల్లోనే పెను ప్రమాదం..



**నేపాల్ :** నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగిన పొఖారా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కేవలం 15 రోజుల ముందే ప్రారంభించారు. 2023 జనవరి 1వ తేదీన దేశ ప్రధాని పుష్పకమల్ దహాల్ ప్రారంభించారు. బెల్ట్ రోడ్ ప్రాజెక్టులో భాగంగా ఈ విమానాశ్రయాన్ని 215 మిలియన్ డాలర్ల రుణం తీసుకొని చైనా సాయంతో నిర్మించారు. కార్యకలాపాలు మొదలుపెట్టిన పక్షం రోజుల్లోనే నేపాల్ గత దశాబ్ద కాలంలోనే చూడనంత అతిపెద్ద విమాన ప్రమాదం చోటు చేసుకొంది.

**ప్రమాదానికి ముందు ఏం జరిగిందంటే..**


నేపాల్‌లోని యతి ఎయిర్‌లైన్స్ విమానం ల్యాండింగ్ చివరి క్షణాల్లో పొఖారా విమానాశ్రయ రన్‌వే సమీపంలో కూలిపోయిందని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిబ్బంది వెల్లడించారు. ఈ విమానాశ్రయంలో తూర్పు, పడమర వైపుల రెండు రన్‌వేలు ఉన్నాయి. కాఠ్‌మాండూలోని త్రిభువన్ ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 10.33కు విమానం గాల్లోకి ఎగిరింది. పొఖారా సమీపించగానే ఏటీఆర్–72 పైలట్ తూర్పు రన్‌వేపై ల్యాండ్ అయ్యేందుకు అనుమతి తీసుకొన్నాడు. కానీ, తర్వాత పైలట్ నిర్ణయం మార్చుకొని పడమర రన్‌వేపై దిగాలని భావించాడు. ఏటీసీ సిబ్బంది దీనికి అనుమతి మంజూరు చేశారు. దీంతో విమానం ల్యాండింగ్‌కు యత్నిస్తుండగా ప్రమాదానికి గురైంది. పైలట్ చివరి నిమిషంలో రన్‌వే మార్చుకోవడానికి సాంకేతిక సమస్యే కారణమై ఉంటుందని భావిస్తున్నారు.

**ల్యాండింగ్‌కు పది క్షణాల ముందు..**

ల్యాండింగ్ కావడానికి కేవలం కొన్ని సెకన్ల ముందు మాత్రమే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తి మొత్తం 72 మంది ప్రాణాలను బలిగొందని అనుమానిస్తున్నారు. వాతావరణ సమస్యల కారణంగా కూలిందనే ప్రచారాన్ని నేపాల్ వైమానిక శాఖ కొట్టిపారేసింది. వాతావరణం అనుకూలంగానేహొఉందని పేర్కొంది. విమానం కూలడానికి ముందు మంటలు చెలరేగినట్లు వెల్లడించింది. బ్లాక్ బాక్స్‌ను విశ్లేషించాక పూర్తి కారణాలు తెలుస్తాయని చెప్పింది.

ఏటీఆర్–72 విమానం అత్యధికంగా గంటకు 500 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. దానిని భూమికి తక్కువ ఎత్తులో కూడా ఎగరగలిగేలా డిజైన్ చేశారు. ఇక యతి ఎయిర్‌లైన్స్ పాత విమానాలను ఎక్కువగా వాడుంతుందనే పేరుంది.

# సోషల్‌మీడియా ప్రచారం కోసం ఇక్కడకు రావొద్దు.. జోషీమఠ్‌పై విచారణకు సుప్రీం నో..



**దిల్లీ :** ఉత్తరాఖండ్‌లోని జోషీమఠ్‌లో భూమి కుంగడాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీనిపై తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. కేవలం సోషల్‌మీడియాలో ప్రచారం కోసం సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయొద్దని.. ఈ ఘటనపై హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. జోషీమఠ్‌లో భూమి కుంగిపోతుండటంతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించేలా కేంద్రానికి మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ అవిముక్తేశ్వరానంద సరస్వతి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో పాటు అక్కడి బాధితులకు పరిహారం, ఆర్థిక సాయం అందించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. "హైకోర్టు విస్తృత అంశాలపై దృష్టిపెడుతుంది. అందువల్ల ఈ పిటిషన్‌తో అక్కడకు వెళ్లేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛ కల్పిస్తున్నాం. జోషీమఠ్ అంశంపై పిటిషనర్ హైకోర్టు ముందు కొత్త పిటిషన్ వేసుకోవచ్చు. లేదా అక్కడ ఉన్న పెండింగ్ పిటిషన్లలో వ్యాజ్యదారుడిగా చేరొచ్చు. ఈ అభ్యర్థనను విచారించేందుకు ఉన్నత న్యాయస్థానానికి అనుమతినిస్తున్నాం" అని ధర్మాసనం వెల్లడించింది.

అయితే.. జోషీమఠ్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దీనిపై విచారణ జరపాలని, బాధితులకు ఉపశమనం కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని పిటిషనర్ సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. "సోషల్‌మీడియాలో ప్రచారం కోసం సుప్రీంకోర్టు వాదనలను ఉపయోగించుకోవద్దు. మీకు కావాల్సింది బాధితులకు ఉపశమనం. దానికి హైకోర్టుకు వెళ్లొచ్చు" అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# దిల్లీ గజ గజ... నేటి నుంచి మరో కోల్డ్ స్పెల్

**దిల్లీ :** దేశ రాజధాని దిల్లీలో ఉష్ణోగ్రతలు మళ్లీ పడిపోతున్నాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు మరో కోల్డ్ స్పెల్ ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ క్రమంలో మూడు డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది. వరుసగా కొన్ని రోజుల పాటు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైతే దీనిని ఓల్డ్ స్పెల్‌గా వ్యవహరిస్తారు.హొఈ నెల 5 నుంచి 9 తేదీల మధ్య ఏర్పడిన కోల్డ్ స్పెల్‌లో దిల్లీ పరిసర ప్రాంతాల్లో వరుసగా అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడిచిన పదేళ్లలో ఇంతటి తక్కువ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇది రెండోసారి. ఐఎండీ తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం గడిచిన 15 రోజుల్లో 50 గంటలపాటు పొగమంచు కురిసింది. 2019 తర్వాత ఇంత పెద్ద మొత్తంలో మంచు కురవడం ఇదే తొలిసారి. ఈ నెల 10 నుంచి క్రమంగా పెరిగిన ఉష్ణోగ్రతలు.. వాయవ్య ప్రాంతం మీదుగా వస్తున్న గాలులతో మరోసారి తగ్గుముఖం పట్టాయి.



రానున్న 5 రోజుల్లో దిల్లీతోపాటు పంజాబ్, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో దట్టమైన మంచు కురిసే అవకాశాలున్నట్లు ఐఎండీ వెల్లడించింది. వాయవ్య ప్రాంతం మీదుగా వీస్తున్న చలిగాలుల వల్ల జనవరి 18 వరకు ఆయా ప్రాంతాల్లో రెండు డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పింది. తాజా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది. వదులుగా, పొరలుపొరలుగా ఉండే దుస్తులు ధరించాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించింది. ఇళ్లల్లో ఉష్ణోగ్రతలను సమతుల్యం చేసేలా రూమ్ హీటర్లు ఏర్పాటు చేసుకోవాలని కోరింది. జనవరి 18 తర్వాత ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశముందని ఐఎండీ అధికారి ఒకరు చెప్పారు.

# లక్షణాలు ఉంటే 10 రోజుల ఐసొలేషన్.. డబ్ల్యుహెచ్‌వో కొత్త మార్గదర్శకాలు జారీ

**జెనీవా :** కరోనా వైరస్ వ్యాప్తి తగ్గుముఖం పట్టిందని భావిస్తోన్న కొన్ని దేశాలు.. సంబంధిత ఆంక్షలను పూర్తిగా సడలిస్తు న్నాయి. కానీ, విస్తృతంగా వ్యాక్సిన్ అందించినప్పటికీ.. చాలా దేశాల్లో మహమ్మారి ప్రాబల్యం కొనసాగుతూనే ఉంది. ఇలా మరో వేవ్ భయాలు నెలకొన్న వేళ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక సూచనలు చేసింది. కరోనా ఇన్‌ఫెక్షన్ సోకిన వ్యక్తులకు సంబంధించి నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. దీంతోపాటు జనసమూహాల్లో మాస్కు ధరించడం, కొవిడ్ చికిత్స, వైద్య నిర్వహణ విషయంలో సిఫార్సులను అప్‌డేట్ చేసినట్లు తెలిపింది. కొత్త వేరియంట్లు వ్యాప్తి చెందుతోన్న నేపథ్యంలో.. మాస్కు



ధరించడంతోపాటు బూస్టరు డోసు వేసుకోవాలని సూచించింది.

**డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాలివే..**

కొవిడ్ ఇన్‌ఫెక్షన్ సోకిన బాధితులకు లక్షణాలు కనిపిస్తే.. అవి మొదలైనప్పటి నుంచి 10 రోజుల పాటు ఐసొలేషన్‌లో ఉండాలి. కరోనా బారిన పడ్డ వ్యక్తికి ఒకవేళ యాంటీజెన్ టెస్టులో నెగెటివ్ వస్తే ఐసొలేషన్ నుంచి ముందుగానే బయటకు రావచ్చు. కొవిడ్ నిర్ధారణ అయి.. లక్షణాలు లేని వారు మాత్రం ఐదు రోజులు ఐసొలేషన్‌లో ఉండాలి. గతంలో వీరికి ఐసోలేషన్ వ్యవధి పది రోజులుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా వైరస్ వ్యాప్తి చెందుతోన్న నేపథ్యంలో.. స్థానిక పరిస్థితులతో సంబంధం లేకుండా మాస్కులను విధిగా ధరించాలని డబ్ల్యూహెచ్‌వో సిఫార్సు చేసింది. చికిత్స విషయంలో నిర్మాట్రెల్విర్– రిటోనావిర్ వినియోగాన్ని కొనసాగించాలని సూచించింది.

# బంగాళాఖాతంలో చిక్కుకుపోయిన 600 మంది 'గంగా సాగర్' యాత్రికులు

**పశ్చిమబెంగాల్ :** మకర సంక్రాంతి సందర్భంగా పశ్చిమబెంగాల్లోని 24 పరగణాల జిల్లా గంగాసాగర్‌లో పుణ్య స్నానాలకు వెళ్లిన సుమారు 600 మంది భక్తులు బంగాళాఖాతంలో చిక్కుకుపోయారు. దీంతో వెంటనే అధికారులు రంగంలోకి దిగి వారిని రక్షించేందుకు చర్యలు చేపట్టారు. ఇక్కడ హుగ్లీ నది–బంగాళాఖాతంలో సంగమించే చోటుకు వీరు రెండు ఫెర్రీల్లో వెళ్లారు. కానీ, సముద్రంలో ఆటు రావడంతో నీరు తగ్గి ఆ రెండు ఫెర్రీలు బురదలో చిక్కుకుపోయాయి.



యాత్రికులు రాత్రి మొత్తం సముద్రంలోనే గడపాల్సి వచ్చింది. ఈ ఘటన కాక్‌ద్వీప్ వద్ద చోటు చేసుకొంది. దీంతో వీరిని రక్షంచడానికి కోస్టుగార్డ్ సిబ్బంది రంగంలోకి దిగారు. వీరికి సహాయ కోసం హొవర్ క్రాఫ్ట్‌ను కూడా పంపారు.హొనిన్న ఒక్క రోజే మకర సంక్రాంతి సందర్భంగా గంగాసాగర్‌లో దాదాపు 10 లక్షల మంది భక్తులు స్నానాలు చేశారు. దాదాపు 51 లక్షల మంది గంగాసాగర్‌ను సందర్శించి పూజలు చేశారు.

# ప్రసార మాధ్యమాలపై సుప్రీం వ్యాఖ్యలు ఆలోచించదగినవే



**ఢిల్లీ :** టీవీ ప్రసార మాధ్యమాలపై సుప్రీంకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు ఆలోచించదగినవే. కచ్చితంగా టీవీ చానళ్లు బాధ్యతగా ఉండాలి. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండరాదు. ఈ సూత్రం ఒక్క టీవీ చానళ్లకే కాదు.. అన్ని వ్యవస్థలకు వర్తిస్తుంది. గౌరవ న్యాయ స్థానం ఆ విషయాన్ని గుర్తించే ఇంత ఆవేదనగా తన వ్యాఖ్యలు చేసినట్లు కనిపిస్తుంది. అయితే అదే సమయంలో కొన్నిసార్లు ప్రభుత్వాలు విద్వేషపూరిత ప్రసంగాలు చేసినవారిపై , వారి ప్రసంగాలను విస్తారంగా ప్రచారం చేసిన చానళ్లపై కేసులు పెడితే న్యాయ వ్యవస్థ స్టే లు ఇవ్వడమో, లేక మరో రకంగానో వారికి రక్షణ కల్పించాయన్న విమర్శలు కూడా లేకపోలేదు. ఒక్కోసారి ఒక్కో గౌరవ న్యాయమూర్తి ఒకో రకంగా స్పందించడం కాకుండా , ఇలాంటి విషయాలలో ఒకే అభిప్రాయం వ్యక్తం అయ్యేలా వ్యవస్థ వ్యవహరిస్తే అప్పుడు దేశానికి ఒక మార్గదర్శకం అవుతుందని చెప్పాలి. సందర్భం ఏదైనా సుప్రీంకోర్టు ఇప్పుడు విద్వేష సమస్యను మరోసారి తెరపైకి తెచ్చింది. టీవీ చానళ్లను బలమైన దృశ్యమాధ్యమంగా మారాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అది వాస్తవమే. అందులోను పాజిటివ్ సమాచారం కన్నా, నెగిటివ్ సమాచారానికే ఎక్కువ ప్రాధాన్యత వస్తుంది. వాటికి టిఆర్పి రేటింగ్ ముడిపడి ఉండడంతో ఆయా చానళ్లు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నాయన్న విమర్శలు లేకపోలేదు. అందులో భాగంగా అశ్లీల నృత్యాలు, విద్వేషపూరిత ప్రసంగాలు, చర్చలు వంటివి ఉంటున్నాయి. కచ్చితంగా వీటిని అడ్డుకోవల్సిందే. అందుకోసం ఏమి చేయాలన్నదానిపై కొన్ని మార్గదర్శక సూత్రాలు లేకపోలేదు. కానీహోవాటిని కొంతమంది పట్టించుకోవడం లేదు. దాంతోనే ఈ సమస్య వస్తోంది.దానికి మీడియా స్వేచ్ఛ అనే ముసుగు తగిలిస్తున్నారు.కచ్చితంగా మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిందే. అలాగే వారు ఏదైనా విద్వేషాన్ని పెంచుతుంటే దానిని అరికట్టవలసిందే. కానీహోకొన్నిసార్లు న్యాయ వ్యవస్థ పూర్తి వివరాలలోకి వెళ్లకముందే విద్వేష వ్యాప్తి చేశారన్న ఆరోపణలు ఉన్నవారికి రక్షణ కల్పిస్తోందన్న అభిప్రాయం ఉంది. పైగా ఆ సమయాలలో కొందరు న్యాయమూర్తులు పోలీసు వ్యవస్థపైన , ప్రభుత్వాలపైన తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. దాంతో అసలు సమస్య పక్కకుపోయి, ఈ తీవ్ర వ్యాఖ్యలే చర్చనీయాంశం అవుతున్నాయి. ఉదాహరణకు ఆంధ్ర ప్రదేశ్ లో ఒక ఎమ్.పిగారు రోజూ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తుండేవారు.

కొన్ని కులాలను కించపరిచేలా మాట్లాడడం, కొన్ని మతాలను అగౌరవపరచేలా సంభాషించడం చేసేవారు. దానిని కొన్ని చానళ్లు నియంత్రించకపోగా, చాలా గొప్ప విషయం అన్నట్లుగా ప్రసారం చేసేవి. ఈ నేపధ్యంలో పోలీసులు సంబందిత రికార్డు అంతటిని తయారు చేసి కేసు పెడితే న్యాయ వ్యవస్థ స్పందించిన తీరు అందరిని ఆశ్చర్యపరిచింది. సదరు ఎమ్.పిగారు తనను పోలీసులు కొట్టారని ఆరోపించారు. ఆయనను నిజంగా కొట్టారో, లేదో తేల్చాలని గౌరవ సుప్రింకోర్టువారు ఆర్మి ఆస్పత్రికి పంపించారు. ఆ ఆస్పత్రిలో చేరిన కొద్ది రోజులకు ఆయన చెప్పాపెట్టకుండా బయటకు వెళ్లిపోయారు.అయినా న్యాయ వ్యవస్థ ఆయనపై చర్య తీసుకోలేదు. పోలీసులు ఆయనపై రాజద్రోహం కేసు పెడతారా అంటూ ఫైర్ అయింది. దాని సంగతి తేల్చేస్తామని చెప్పారు. అదీ జరగలేదు.గౌరవ కోర్టువారు ఎపి ప్రభుత్వ ఆస్పత్రులు ఇచ్చిన నివేదికలను పరిశీలించిన తర్వాత , ఇమేజీలను అబ్జర్వ్ చేసిన తర్వాత తగు నిర్ణయం చేసినట్లు అనిపించలేదు. అయినా ఫర్వాలేదు. ఒకవేళ పోలీసులు ఏమైనా తప్పు చేసి ఉంటే చర్య తీసుకోవచ్చు. కాని అలా కాకుండా ఆ కేసు పక్కదారి పట్టేలా సాగితే మరి ఎవరిని తప్పు పట్టాలి. ఇప్పటికీ ఆ కేసు ఒక కొలిక్కి రాలేదు. చివరికి ఆ ఎంపీగారు ఆ రాష్ట్రానికి వెళ్లడం మానుకున్నారు. పైగా పోలీసుల విచారణకు కూడా హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. దానికి తోడు ప్రతిపక్షం పోలీసులపై , ప్రభుత్వం లేనిపోని ఆరోపణలు చేస్తుంటుంది. దానికి న్యాయవ్యవస్థ తీసుకున్న కొన్ని నిర్ణయాలే కారణం. ఈ విషయాన్ని కూడా గౌరవ న్యాయమూర్తులు పరిశీలించవలసిన అవసరం ఉంది. విద్వేషపూరిత ప్రసారాల విషయంలో ముందుగా రాజద్రోహం సెక్షన్లు వర్తిస్తాయా?లేదా? ఒకవేళ వర్తించకపోతే, మరే సెక్షన్ కిందకేసు పెట్టాలి?అన్నది తేల్చిన తర్వాత సుప్రింకోర్టు ఈ విషయంలో ముందుకు వెళితే బాగుంటుందనిపిస్తుంది. ఈ ఎంపీగారి కేసులో విద్వేషపూరిత ప్రసంగాన్ని, దానిని ప్రసారం చేసిన చానళ్లను ఒక కేసు కింద, ఒకవేళ పోలీసులు ఆ ఎంపీని హింసించి ఉంటే దానిని విడిగా మరో కేసు కింద పరిగణించి విచారణ చేపట్టి ఉంటే న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెరిగేది. కొన్నిసార్లు కొందరు న్యాయమూర్తులు తమ సొంత అభిప్రాయాలను యధేచ్ఛగా వ్యక్తం చేస్తున్నారు. అవి ఒక్కోసారి రాజకీయ వ్యాఖ్యల మాదిరిగా ఉంటున్నాయి. అలాంటి స్వేచ్ఛ న్యాయమూర్తులకు

# తిరుమల కొండను భక్తులకు దూరం చేయాలనుకుంటున్నారా?




**(వి న్యూస్ మచిలీపట్నం):** పవిత్రమైన తిరుమల కొండను ప్రజలకు, భక్తులకు దూరం చేయాలనుకుంటున్నారా అని ప్రభుత్వాన్ని హిందూ ధార్మిక భక్తులు కృష్ణాజిల్లా మచిలీపట్నంలో తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం నందు సోమవారం ప్లే కార్డులు తో నిరసన తెలుపుతూ టీటీడీ కళ్యాణ మండపం గేటు ముందు ఆందోళన నిర్వహిస్తూ ప్రశ్నించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు హిందూ భక్తులు మీడియాతో మాట్లాడుతూ టీటీడీ అతిథి గృహాలలో అద్దె రేట్లను భారీగా పెంచడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల కొండను భక్తులకు దూరం చేయాలనుకుంటున్నారా అని ధ్వజమెత్తారు. పదేపదే గదుల అద్దెలు ఎందుకు పెరుగుతున్నాయని నిలదీశారు. సామాన్యులకు శ్రీవారి దర్శనం ఎందుకు భారంగా మార్చుతున్నారని మండిపడ్డారు. గదుల అద్దెలు 1100 శాతం పెంచడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు.

సినిమా టిక్కెట్ ధరలను ఎందుకు తగ్గించారని ప్రశ్నించగా పాలకులు పేదవాడు సినిమా చూడకూడదా అని ప్రశ్నించారు? మరి ఇప్పుడు పేద భక్తుడు భగవంతుని దర్శనానికి పనికిరాడా?కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆదాయ వనరుగా ఎందుకు చూస్తున్నారు. స్వామి స్వయంభూగా వెలిసిన ప్రదేశం తిరుమల. తిరుమల కొండకు చేరిన భక్తులకు టోల్ టాక్స్ రూపంలో బాదుడు ప్రారంభమవుతుంది అన్నారు. కలియుగ దైవం విషయంలో అహంకారం వద్దని, భక్తుల మనోభావాలు గుర్తించాలని హితవు పలికారు. తిరుమల పవిత్రతను కాపాడి, పెంచిన అద్దె గదుల రేట్లను తగ్గించి సామాన్యులకు అందుబాటులో దర్శనం కలిగేలా టీటీడీ పాలకమండలి నిర్ణయాలు తీసుకోకపోతే స్వామి భక్తులు అందరిని ఐక్య పరుస్తూ ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, పి.వి. ఫణి కుమార్, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, బి. సత్యనారాయణ సింగ్, సూరిశెట్టి హరికృష్ణ, అద్దేపల్లి గోపికృష్ణ, మోపిదేవి శ్రీనివాస్, తాడికొండ శ్యామలరావు, కోటేశ్వరరావు, తదితర హిందూ ధార్మిక భక్తులు పాల్గొన్నారు.

# కుప్పంలో చంద్రబాబు ఓటమి తథ్యం : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



**తిరుపతి:** ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రజాకంఠకుడుగా, రాక్షసుడుగా మారాడని రాష్ట్ర ఇంధన, అటవీ, పర్యావరణ, శాస్త్ర–సాంకేతిక, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. తిరుపతిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పార్టీ కార్యకర్తలన గుండాలుగా మార్చి రెచ్చగొట్టే నీచానికి చంద్రబాబు దిగజారాడని విమర్శించారు. చివరికి న్యాయమూర్తులపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ చంద్రబాబు తన కుటిల రాజకీయ నైజంను చాటుకున్నాడని ఆరోపించారు. తన జెండాను మోయలేక, పవన్ కళ్యాణ్ కు జెండాను అప్పగించిన చంద్రబాబుకు కుప్పంలో తన ఓటమి అర్థమవుతోందని అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

**మేం ప్రజల కోసమే పనిచేస్తున్నాం**

చిత్తూరు జిల్లాలో చంద్రబాబు మాట్లాడుతూ... "నీ అంతుచూస్తా, నీ పని అయిపోయింది, కాస్కో.." లాంటిపదాలు ప్రయోగించాడు. చంద్రబాబు మానసిక పరిస్థితి బాగోలేదని ఈ మాటలను బట్టి అర్థమవుతోంది. మా నేత జగన్, పార్టీలోని మంత్రులు, ఇతర నేతలు అంతా ప్రజల కోసమే పనిచేస్తున్నారు. చంద్రబాబులా, తమ పార్టీ కార్యకర్తలు, తమ కుటుంబసభ్యులు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, ఈనాడు రామోజీరావు, దుష్ట చతుష్టయంల కోసం పనిచేయడం లేదు. కేవలం ప్రజల కోసమే పనిచేస్తున్నాం.

**జిల్లాలో అడుగు పెట్టిన నాటి నుంచి మాపైన ఏడుపే**

ఏ కార్యక్రమం చేపట్టినా జగన్ ప్రజల సంక్షేమం కోసం, వారి కుటుంబాలు బాగుపడాలనే మంచి ఉద్దేశంతోనే పనిచేస్తున్నారు. మరి ఇవ్వన్నీ కూడా చంద్రబాబుకు తెలియనివి కావు. కానీ ఆయన ఎజెండా ఏమిటీ? ఈ జిల్లాకు వచ్చిన నాటి నుంచి ప్రతిరోజూ ఏదో ఒకటి మాట్లాడుతున్నాడు. పండుగ రోజు కుటుంబసభ్యులు, పిల్లా పాపలతో సంతోషంగా గడుపుకుంటున్న మాపై తెల్లవారుతూనే నా మీద, మా నాయకుడు వైయస్ జగన్‌పైనా ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నాడు. ఈ రోజు మళ్ళీ అదే ఏడుపు. ఈ రోజు కడప నుంచి వస్తూ దారిలో చూస్తే ఆయన కోసం తెలుగుదేశం పార్టీకి చెందని వందిమాగధులు ఎదురుచూస్తూ ఉన్నారు. ఎప్పుడూ రాని వ్యక్తికి పదిమంది వస్తే గొప్పనాయకుడిని అని అనుకుంటాడు. రోజు మాకు వేల మంది వస్తారు. మేం దానిని గొప్పగా అనుకోము. తనకోసం ఎదురుచూస్తున్న వారిని చూసి ఒళ్ళు మరిచిపోయి చంద్రబాబు కారుకూతలు కూస్తున్నాడు. దీనిని చిత్తూరు జిల్లా ప్రజలు సహించరు. ఎప్పుడో నీకు రాజకీయ భవిష్యత్తును చించేశారు. ఈ సారి ఉండేది కూడా పోతుంది. నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడతాను అని అనుకుంటే ప్రజలు ఊరుకోరు. ఈ జిల్లాలో తిరిగి నువ్వు మళ్ళీ పోటీ చేసే పరిస్థితి ఉండదు.

**చంద్రబాబూ.. నీ పని అయిపోయింది**

నిన్ననే చెప్పాను. చంద్రబాబు నీ పని అయిపోయింది. కుప్పంలో కూడా నీ జెండా పీకేసి, వైయస్‌ఆర్సిపి జెండా పాతుతాం. అక్కడ కూడా మా అభ్యర్థే గెలుస్తారు. రాజకీయాల కోసం చంద్రబాబు ఇంతగా ఆరాటపడాల్సిన పనిలేదు. ఇప్పటికే చంద్రబాబు గాడితప్పాడు. ప్రజాసేవ నుంచి స్వప్రయోజనాలను కాపాడుకునేందుకు రాజకీయాలను వాడుకున్నాడు. ఆయన రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు కూడా తాను తన కుటుంబం కోసమే పనిచేశాడు తప్ప ప్రజల కోసం ఎప్పుడూ పనిచేయలేదు. చివరికి తన మామను కూడా అడ్డం పెట్టుకున్నాడు. అటువంటి వ్యక్తి మా గురించి మాట్లడటం ఒక రాక్షసుడు, ప్రజాకంఠకుడు ప్రజల గురించి మాట్లాడినట్లు ఉంది. ఇది ఇది చాలా విడ్డూరంగా ఉంది.

**బషీర్ బాగ్ లో రైతులపై కాల్పులు, అంగన్ వాడీ మహిళలను గుర్రాలతో తొక్కించాడు**

చంద్రబాబు స్టేట్ స్పాన్సర్డ్ టెర్రరిజం అని మాట్లాడుతున్నాడు. ఇటువంటిది నువ్వు చేశావు. బషీర్ బాగ్ లో కరెంట్ కోసం పోరాడిన రైతులను కాల్చేశావు. తమ కుటుంబ భవిష్యత్తు కోసం ఉద్యమించిన అంగన్ వాడీ మహిళలను గుర్రాలతో తొక్కించావు. అలాంటివి నియంతలు చేస్తారు. అలాంటి నువ్వు ప్రజాస్వామ్యం గురించి, మంచి పాలన గురించి మాట్లాడుతున్నావు అంటే చంద్రబాబుకు తల తిరిగి, వయస్సు మళ్ళీ, అల్జీమర్స్ పెరిగిపోయి మాట్లాడుతున్నావని అర్థమవుతోంది. చంద్రబాబు నోరు తెరిస్తే మమ్మల్ని తిట్టడం తప్ప వేరే పనిలేదని రాష్ట్రప్రజలకు తెలుసు. దాని గురించి పట్టించుకోవాల్సి అవసరం లేదు.

**పండుగ కూడా ప్రశాంతంగా జరుపుకోనివ్వడం లేదు**

చంద్రబాబు తన విమర్శలతో మమ్మల్ని ప్రశాంతంగా పండుగ జరుపుకోనివ్వకుండా, ఎదురు మాపైనే దాడి చేస్తున్నాడు. మా మీద నిత్యం ఏడుస్తూ, తనను పండుగ జరుపుకోనివ్వలేదని ఎలా అంటాడు? అన్ని మాటలు మాట్లాడేది చంద్రబాబే, తిరిగి పండుగ చేసుకోనివ్వలేదని మాపై ఎందుకు ఏడుస్తున్నాడు?

**నువ్వు సీఎంగా ఉన్నప్పుడు ఎంతో మందిపై అక్రమ కేసులు పెట్టించావు**

రఘురామకృష్ణంరాజును కొట్టినట్లు కొట్టారు అని చంద్రబాబు వ్యాఖ్యానించాడు. రఘురామకృష్ణంరాజును ఎవరు కొట్టారు... ఎక్కడ కొట్టారు.... చట్ట ప్రకారం అరెస్ట్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఒక పద్దతిగా రాజకీయాలు చేసే వారిని ఎవరూ అరెస్ట్ చేయరు. మితిమీరి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే పోలీసులు చర్యలు తీసుకోకూడదు, అలా చేస్తే రాజకీయంగా చేశామని ఆరోపిస్తున్నాడు. నువ్వు సీఎంగా ఉన్నప్పుడు ఎంత మందిని అకారణంగా అరెస్ట్ చేశావు, ఎంత మందిని ఇబ్బంది పెట్టావు. ఇప్పుడ చిలుక పలుకులు మాట్లడుతున్నాడు. ఇలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండాలా, ఉండకూడదా అనేది చంద్రబాబే తేల్చుకోవాలి. నీ అంతుచూస్తా, నీ పని అయిపోయిందని నా గురించి చంద్రబాబు మాట్లాడుతున్నాడు. ఈ జిల్లా ప్రజలు ఉన్నన్ని రోజులు ప్రజలు మా పక్షాన, మేం ప్రజల పక్షాన ఉంటాం. నువ్వు ప్రజాకంఠకుడువి. గతంలో నువ్వు ఏ విధంగా ప్రజాకంఠన పరిపాలన చేశావో, ఏ విధంగా ప్రజలు నిన్ను ఛీ కొట్టారో అందరికీ తెలుసు.

**చిత్తూరు జిల్లాలో వైయస్‌ఆర్ సిపి గెలుపును అడ్డుకోవడం నీ తరం కాదు**

చిత్తూరు జిల్లాలో మెజారిటీ సాధించాలంటే నీ నుంచి కాదు, నీ బాబు నుంచి కూడా కాదు. నిన్ను పుట్టించిన తాతల నుంచి కాదు. ఇక్కడ వైయస్‌ఆర్ సిపి మాత్రమే అధికారంలోకి వస్తుంది, వైసిపి ఎమ్మెల్యేలే గెలుస్తారు. జగన్ గారు ప్రజలకు ఎంత మంచి చేశారనే దానికి ఇది ఒక కొలబద్ద. నీకు ప్రజాకంఠకుడు అనే పేరు ఎప్పుడో ఉంది. ఇప్పుడు కొత్తగా మేం చెప్పాల్సిన పనిలేదు. నా అంతు నువ్వు చేడాల్సిన పనిలేదు. నీ అంతు చిత్తూరు జిల్లా ప్రజలే చూస్తారు.

నా మీద పోటీ చేయమని చంద్రబాబును ఆహ్వానిస్తున్నాను

పుంగనూరులో నాపైన చంద్రబదాబు పోటీ చేయాలి. ఆయనను ఆహ్వానిస్తాను. ఆయన పిలిస్తే, మా సీఎం గారు ఆదేశిస్తే ఆయన మీద కుప్పంలో పోటీ చేస్తా. మా పోరాటం అంతా చంద్రబాబు మీదనే. ఆయన కూడా అలా పోరాడవచ్చు. చంద్రబాబు మేకపోతు గంభీర్యం ప్రదర్శిస్తున్న రాజకీయనాయకుడు, ఆయనకు ధైర్యం లేదు. అటువంటి సాహసం చేయడు. జగన్ గారు ఎక్కడ పోటీ చేయమంటే అక్కడ పోటీ చేస్తాం.

# ప్రభుత్వం మంజూరు చేసిన రెండో ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలి

## - ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల విజ్ఞప్తి



**(విన్యూస్, విజయవాడ):** విద్యా శాఖలో పరిపాలనా సౌలభ్యం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్తగా మంజూరు చేసిన 692 మండల విద్యాశాఖాధికారి పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జీవో నంబర్ 154 ప్రకారం హాప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఈ పోస్టులపై ప్రస్తుతం పనిచేస్తున్న మండల విద్యాశాఖాధికారుల సంఘం తమకు అనుకూలంగా లేదని లోగడ జీవో 154 ను రద్దు చేయమని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.కానీ తదుపరి ఆలోచించుకొని వేసిన రిట్ పిటిషన్‌ను ఉపసంహరణ చేసుకున్నట్టుగా సమాచారం తెలుస్తోందన్నారు.

అందువలన ముఖ్యమంత్రి ఆలోచన ప్రకారం కొత్తగా సృష్టించిన అదనపు 692 మండల విద్యాశాఖాధికారి పోస్టులను (ఎంఈఓ– 2) భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని సామల తెలిపారు. ఇందుకుగాను జాప్యం లేకుండా జీవో 154 ప్రకారం ఎంఇఓ పోస్టులను భర్తీ చేసేందుకు జాబ్ చార్ట్, విధి విధానాలను తక్షణమే రూపొందించి, ముఖ్యమంత్రి ఆలోచన కు కార్యరూపం ఇవ్వాలని, ఇందుకు విద్యాశాఖ మంత్రి, విద్యాశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సామల సింహాచలం విజ్ఞప్తి చేశారు.

V స్మార్ట్ యాడ్స్

**Insurance**
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అన్ని రకాల వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించబడును. ఇన్సూరెన్స్ చేయించుకోదలచిన వారు సంప్రదించండి: టి.సి.ఎన్ శ్రీనివాస్. 9246761404 08672-221097

**మస్కిటో డోర్స్&విండోస్**
చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్... అల్యూమినియమ్ మస్కిటో డోర్స్&విండోస్ తయారు చేయబడును. మరియు రిపేర్ చేయబడును. సంప్రదించండి: చక్రిస్ మస్కిటోడోర్స్&విండోస్ గొడుగుపేట-మచిలీపట్నం సెల్:9182197822 9121605277

**అద్దెకు ఇవ్వబడును**
జిల్లా కోర్టు సాయిబాబాగుడి ఎదురురోడ్డులో తూర్పు ఫేస్‌లో 1,2 ఫ్లోర్లలో కమర్షియల్ స్పేస్ అద్దెకు ఇవ్వబడును. బ్యాంకులకు, డాక్టర్లకు మొ॥లగు వారు సంప్రదించండి. లిఫ్ట్ సౌకర్యం కలదు.
సంప్రదించండి: 7997883575 9347576464 9515237110

వి స్మార్ట్ యాడ్స్ కేవలం రూ.100/-లకే స్మార్ట్ యాడ్..
సంప్రదించండి 9848667347

**ఆర్గానిక్ తేనె**
సెల్: 7981850205



ఆర్గానిక్ తేనె
మచిలీపట్నంలో... ఆర్గానిక్ తేనె కోసం సంప్రదించండి: 7981850205

మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలకు సదవకాశం
వాటర్ సర్వీసింగ్ & ఇంజన్ ఆయిల్ (జనరల్ సర్వీస్‌తో)
కేవలం రూ. 449/-లకే బైక్ జాబ్ కార్డు ఇవ్వబడుతుంది.
ప్రతి ఒక్కరు ఈ అవకాశమును వినియోగించుకోవలసినదిగా మనవి.
నందిని ఆటోమొబైల్
అన్నిరకముల టూవీలర్ స్పేర్ పార్ట్స్ & ఇంజన్ ఆయిల్స్ మరియు టైర్లు లభించును.
సెల్ : 7396 7396 79
నవరంగ్ ఆటో కన్సల్టెన్సీ
లక్ష్మీటాకీస్ సెంటర్, డి-మార్టు రోడ్, మచిలీపట్నం - 521 002.
సెల్ : 9848520822



**శ్రీ శివరామకృష్ణ జ్యోతిష్యాలయము**
శంకర మఠం ప్రక్కన, గొడుగుపేట, మచిలీపట్నం.
జాతక పరిశీలన చేసి వివాహ, ఉద్యోగ, వ్యాపార, సంతాన తదితర విషయాల్లో దోషాలకు పరిహారాలు సూచింపబడును.
వివాహ పొంతన పరిశీలింపబడును. సుముహూర్త నిర్ణయం చేయబడును.
సంప్రదించండి : 96407 54054–91828 17435

**స్థలం అమ్మబడును.**
డోకిపర్రు వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో నిడుమోలు-కౌతవరం మెయిన్ రోడ్డులో 16సెంట్ల భూమి అమ్మకానికి కలదు. 60-120 సైజులో గల కమర్షియల్ భూమి కావల్సిన వారు వెంటనే సంప్రదించండి:
సంప్రదించండి: 7997883575 9347576464

**తక్కువధరకే ప్రకటనలు**
ఇల్లు/స్థలం అమ్మలన్నా, కొనాలన్నా, అద్దెకు ఇవ్వాలన్నా, ఉద్యోగం కావాలన్నా, ఉద్యోగులు కావాలన్నా తక్కువ ధరతో విన్యూస్‌లో ప్రకటన ఇచ్చి నిశ్చింతంగా ఉండండి. మరిన్ని వివరాలకు సంప్ర: 9848667347

**అమ్మబడును**
మచిలీపట్నం శివారు రాడార్ కేంద్రం దగ్గర కళ్యాణీటౌన్‌షిప్‌లో 300గజాల ఫ్లాట్ అమ్మబడును. కావల్సిన వారు సంప్రదించండి: సెల్: 7032931205 సంప్రదించు వేళలు: ఉదయం11 - 2పిఎం

**వంట మనిషి కావలెను**
మచిలీపట్నం జల్దువారితోట డీమార్టు వెనుక నలుగురు గల కుటుంబంనకు వంట మనిషి కావలెను. (నాన్‌వెజ్) సంప్రదించండి: (ఉదయం10 నుంచి2గంటల) సెల్:7032931205

# మద్దిపట్లలో సంక్రాంతి పోటీలు



**(వి న్యూస్ పెడన):** కృష్ణా జిల్లా పెడన అసెంబ్లీ నియోజకవర్గం, గూడూరు మండలం మద్దిపట్ల ఎస్సీ కాలనీలో సంక్రాంతి సందర్భముగా మహిళల కు, యువతలుకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ విభాగాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించడం జరిగింది.

# అన్ని పార్టీల ఎస్సీ సేల్ నాయకులు ఎవరికోసం పని చేస్తున్నారు

## - రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి వాగ్మారే అభిషేక్



**(వి న్యూస్ నిజాంబాద్):** మల్లమరి మల్లికార్జున్ నిజాంబాద్ జిల్లాలోని కోటగిరి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో తెలుగు బోధించే ఒక దళిత టీచర్ పై (మనువాదులు,దాని అనుబంధ సంఘాలు,పార్టీ) దాడి చేసిన,ఒక దళిత ఉద్యమ కారుని ఇంటి పై దాడి చేసిన మౌనంగా ఉన్నారా? సిగ్గు అనిపించడం లేదా?అంబెడ్కర్ పేరు మీద బతుకును వెళ్లదీస్తూ ఆయన ఆశయ నిర్మాణానికి శత్రువుల దాడికి మౌనం వహిస్తారా? మనువాది పార్టీ నాయకులు మాట్లాడకపోతే సరి మిగతా పార్టీల కాంగ్రెస్ లో బిజెపిలో టిఆర్ఎస్లో తెలంగాణలో ఉన్నటువంటి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు నాయకులు మౌనం ఎందుకు? ఇంతకు మీరు ఏ పార్టీ ఎస్సీసెల్ అర్థం కావడం లేదు.మీ పార్టీల నాయకులు మత వాద పార్టీలను తిడుతా ఉంటే మీకు చలనం లేదా ఈ విషయంలో మీకు ప్రశ్నించే హక్కు, పోరాటం చేసే హక్కు లేదా?మరి అలా హక్కు లేని పదవులు ఎందుకు అడుక్కోవడానికా,అమ్ముడు పోవడానికా? టిఆర్ఎస్ లో ,హౌకాంగ్రెస్లో బిజెపిలో ఉన్న(ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు కార్యదర్శులు అమ్ముడు ,దీనికి ఇంకేదైన అర్థం ఉందా)దీనికోసమేనా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ , మనకోసం తన కుటుంబంతో సహా త్యాగం చేసింది.ఇప్పుడు ఒక మల్ల మరి మల్లికార్జున్ నిజాంబాద్ జిల్లాలోని కోటగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు బోధించే టీచర్ ,ఉద్యమ కారులు,రేపు మీ నాయకులు లొంగిపోతే ఆ ఉద్యమకారుల స్థానంలో మీరు ఉండరా? ఆలోచించండి .మీకు జరిగితే మీ ప్రతిపక్ష పార్టీ సెల్ బాద్యులు అడుగుతారా?(అడిగే ధైర్యం రావాలి)మనకు వచ్చిన హక్కులు ఎవడి దయదక్షిణ్యానాల మీద రాలె డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ త్యాగం తో అనుభవిస్తున్నము. ఉద్యమాలను,దాని నాయకులను బ్రతికించుకునే బాధ్యత బాబాసాహెబ్ ద్వారా మనిషిగా బ్రతుకుతున్న ప్రతీ ఒక్కడి బాధ్యత .ఆలోచించండి సోదరులారా మనం పార్టీలతో సంభందం లేకుండా ఎవరికి ప్రమాదమొచ్చినా ఉమ్మడి ఆలోచన,పోరాటం,రాజకీయ ఐక్యత ఇవి ఖచ్చితంగా ఉంటే అందరం నాయకుల మే ,అధికారం మన కడప ముంగిట ఉంటుంది.శత్రువు నిరంతరం (ఎస్సీసెల్ తో సంభందం లేకుండా)నిన్ను చూస్తే ఉచ్చ పోసుకుంటాడు.నిన్ను నాయకుడిగా గుర్తిస్తారు.లేకపోతే నీవు మాన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాటలో చెప్పాలంటే చెంచావే అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆత్వలే) తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి అన్నారు.

# ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీ ని విజయవంతం చేయాలి: బొల్లా వెంకన్న,

**(వి న్యూస్ బంటిమిల్లి ):** తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారకరామారావు 27 వ వర్ధంతిని పురస్కరించుకుని జనవరి 18 వ తారీఖున ఉదయం 9 గంటలకు రసూల్ పుర చౌరస్తా లో తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, భారత ప్రజల ఆశాజ్యోతి,జన్మభూమి ప్రధాత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న ఎన్.టి.ఆర్ అమరజ్యోతి ర్యాలీ లో ఎన్.టి.ఆర్ అభిమానులు, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని అఖిలభారత ఎన్.టి.ఆర్ అభిమాన సంఘాలా ప్రధాన కార్యదర్శి బొల్లా వెంకన్న తెలిపారు.

# ఉద్యోగుల భద్రత,హక్కుల సాధన సంఘాలతోనే సాధ్యం




**(వి న్యూస్ చల్లపల్లి):** ఉద్యోగులు నిబద్ధత నిజాయితీతో విధులు నిర్వహించే సందర్భంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారం , వారి హక్కుల సాధన ఉద్యోగ సంఘాల తోనే సాధ్యం అని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. చల్లపల్లి లోని బిఆర్ అంబేద్కర్ సేవా సదన్ నందు జరిగిన సచివాలయ ఉద్యోగుల సమావేశంలో సురేష్ బాబు మాట్లాడుతూ ఉద్యోగులు విధులు నిర్వర్తించే సమయంలో అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వాటిని అధికమించి విధులు నిర్వర్తించాలంటే ఉద్యోగ సంఘాల మద్దతు,పాత్ర కీలకం అని పేర్కొన్నారు.ఉద్యోగులు విధులు నిర్వహణతో పాటు హక్కులు,ఆత్మగౌరవం కాపాడుకోవడం కూడా ముఖ్యమేనని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించే క్రమంలో సచివాలయ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు.ఉద్యోగులకు లక్ష్యాలను నిర్దేశించడం, వాటి అమలు కోసం అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడం వల్ల ఉద్యుగుల్లో అభద్రతా భావం ఏర్పడతుందని పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర నేత డి. కోటయ్య,జిల్లా అధ్యక్షుడు మేడేపల్లి సుబ్బారావు,జి. నరేష్, కె.కిరణ్ కుమార్, జి. వీరంజనేయులు,ఎం.అనూష, సిహెచ్.సరళ, డి. లక్ష్మి దుర్గ, కె.సుబ్రహ్మణ్యేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# క్యాలెండర్ పంపిణీ




**(వి న్యూస్ విజయవాడ):** ఏడాది పొడుగునా పలు శుభ సందర్భాలను పురస్కరించుకొని వినియోగదారులకు విశేష సేవలను అందిస్తూ వస్తున్న విజయవాడ, ఎమ్.జి. రోడ్డులోని ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ అధీకృత సంస్థ పైలెట్ సర్వీస్ స్టేషన్ (పెట్రోల్ బంక్) సంక్రాంతి పర్వదినాన వినియోగదారులు సభ్యుల ఫొటోతో కూడిన 2023 సంవత్సరం కలర్ఫుల్ క్యాలెండర్ను ఉచితముగా అందిజేయడం జరిగినది.

దాదాపు 600 మంది వినియోదారులు తమ తమ కుటుంబ సభ్యులతో వచ్చి ఫొటోలు దిగి, వెనువెంటనే వారి వారి ఫొటోలతో ఉన్న క్యాలెండర్ను తమ వెంట తీసుకొని వెళ్ళడం జరిగినది. ప్రధానంగా మహిళలు, పిల్లలు పాల్గొని ఎంతో ఉత్సహంగా తమ ఆనందాన్ని వెలిబుచ్చినారు. ఈ సందర్భంగా పిల్లలకు స్వీట్స్, గాలిపటాలను యాజమాన్యం అందజేయడం జరిగినది.

ఈ కార్యక్రమములో సంస్థ అధిపతి ఎమ్.వి.వి. సత్యనారాయణ పాల్గొని గత 8 సంవత్సరాలుగా సంక్రాంతి పండుగకు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమములో ఐ.ఓ.సి.యల్. ఛీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ నరేంద్రమౌర్య, అనిల్, ఎన్.టి.ఆర్.జిల్లా సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్ , సంస్థ మేనేజర్ కె.వెంకటప్పయ్య, నందకిషోర్ పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ జిల్లా జాయింట్ సెక్రటరీగా న్యాయవాది అరవింద్



**(వి న్యూస్ మచిలీపట్నం):** విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా సహా కార్యదర్శి గా న్యాయవాది నున్న అరవింద్ నియమితులైయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు బూరగడ్డ శ్రీనాథ్, విశ్వహిందూ పరిషత్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ నాయుడు ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో నూతనంగా సహకార్యదర్శిగా నియమితులైన అయినటువంటి నున్న అరవింద్ మాట్లాడుతూ హిందువులందరినీ సంఘటితం చేయడమే తన కర్తవ్యం అని అలాగే దేవాలయాలు వాటి ఆస్తుల పరిరక్షణ కూడా తన బాధ్యత అని తెలియజేశారు, తను నమ్మి తనకి బాధ్యత అప్పజెప్పిన కృష్ణా జిల్లా అధ్యక్షులు అయినటువంటి బూరగడ్డ శ్రీనాథ్ కి , విశ్వహిందూ పరిషత్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ అయినటువంటి నాయుడు కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అయినటువంటి కాంతారావు , ట్రెజరర్ అయినటువంటి శ్రీకాంత్ ,హౌబజరంగ్దళ్ జిల్లా ప్రముఖైనటువంటి శ్రీరామ్ శర్మ మహంకాళి , బాలాజీ , కనకారావు, కొండేటి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరు మన సంక్రాంతి కార్యక్రమం



**(వి న్యూస్ గుడివాడ):** కృష్ణాజిల్లా, గుడివాడ నియోజకవర్గం... మన ఊరు మన సంక్రాంతి కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ టు వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి వెంకటేశ్వరరావు (నాని) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు ప్రదర్శన నిర్వహించారు. అయితే సంక్రాంతి పండుగ రోజు ఆదివారం ఎడ్ల బండలాగుడు ప్రదర్శనను కృష్ణాజిల్లా ఎస్పీ జాషువా దంపతులు ప్రారంభించారు. ఈ ప్రదర్శనను సతీసమేతంగా జిల్లా ఎస్పీ, మాజీ మంత్రి కొడాలి నాని, ఉప్పాల రాంప్రసాద్ తదితరులు వీక్షించారు.

# నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్ ఐ కి ఆత్మీయ సన్మానం ....

## - గంగవరపు శ్రీనివాసులు నాయుడు.




**(వి న్యూస్ మర్రిపాడు):** మర్రిపాడు మండల పోలీస్ స్టేషన్ లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్ రెడ్డి ని సోమవారం మండల వైసీపీ మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులు నాయుడు వారి పెద్ద కుమారుడు గోవర్ధన్ నాయుడు కలిసి ఎస్.ఐ ని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. గంగవరపు శ్రీనివాసు నాయుడు మాట్లాడుతూ నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పే విధంగా చూడాలని,ప్రజా సమస్యల ను సత్వరపరిష్కారం అయ్యేటట్లు చూడాలని కోరారు.మండల పరిధిలో గల హైవేపై జరుగు ప్రమాదాలను నిరోధించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఎస్.ఐ విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ మండల ప్రజలు మరియు ప్రజాప్రతినిధులు అందరూ సహకరిస్తే అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు.పోలీసులకు సహకరించాలని అన్నారు. పోలీస్ చట్టానికి విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండాలనిఈ సందర్భంగాఎస్.ఐ విశ్వనాథ్ రెడ్డి కోరారు.

# తెలుగు సంస్కృతి కి ప్రతీక సంక్రాంతి పండుగ ఎన్ ఆర్ ఐ తుమ్మల రాంబాబు



**(వి న్యూస్ బాపులపాడు):** కృష్ణా జిల్లా బాపులపాడు మండలం రంగన్న గూడెం లో సోమవారం ఉదయం రంగన్న గూడెం రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్ ఆర్ డి ఎస్) ఆధ్వర్యంలో సంప్రదాయ సంక్రాంతి పండుగ మహొత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా సంక్రాంతి కి గ్రామానికి విచ్చేసిన అతిథులు ఎన్ ఆర్ ఐ లు విద్యార్థులు యువత బంధుమిత్రులతో సమావేశం నిర్వహించి బోగి సంక్రాంతి కనుమ పండుగ విశేషాలు వివరించారు అనంతరం ఎన్ ఆర్ ఐ తుమ్మల రాంబాబు గ్రామ ప్రముఖులు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకటగోపాలకృష్ణారావు సమ ఉజ్జీలుగా ఉండి సంప్రదాయ కోడి పందాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎన్ ఆర్ ఐ తుమ్మల రాంబాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ హైందవ సంస్కృతి సంప్రదాయాలకు ఆచారాలకు కేంద్ర బిందువు అని పండుగలు శుభసూచకాలు ప్రతి కుటుంబం లో కష్ట నష్టాలను మురిపించి నూతన ఉత్తేజం కలిగిస్తుంది అన్నారు బోగి తో మొదలైన ఈ పండుగ లో డోలు సన్నాయి వాయిద్యాలు వాటికి అనుగుణంగా విన్యాసాలు చేసే గంగిరెద్దులు హరిలో రంగ హరి అంటూ బోడి తలపై రాగి అక్షయపాత్ర కదలకుండా చిందులు తొక్కి హరిదాసులు అడుగడుగునా ముగిళ్ళలో రంగవల్లులు బోగి మంటలు కోడి పందాలు బొమ్మల పండుగలతో కలబోసిన గ్రామీణ సుందర మనోహర దృశ్యాలు తెలుగు వారికే ప్రత్యేకమైన సంప్రదాయ ప్రతీకలు అన్నారు, గ్రామ ప్రముఖులు సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళవెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ లో ప్రతి రోజూ ఒక ప్రత్యేకత ఉంటుందని వ్యవహార నిబంధనలు ఉంటాయని స్తానాదికాలు ఎలా నిర్వహించాలి ఎలా ఆచరించాలి ఎటువంటి పూజలు ఆచరించాలి ఎటువంటి దానాలు చేయాలి అని మన శాస్త్రాలు విపులంగా వివరించాయి అన్నారు ఇవి శారిరక ధారుడ్యం పెంపొందించి వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతూ సమతను పెంపొందిస్తాయి అని నువ్వుల నూనెతో అభ్యంగనస్నానం శారీరక రుగ్మతలను నివారిస్తుందని పువ్వులు సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని ఈరోజు జరిపే శాంతి హొమాలు మృత్యుజయ హొమాలు ఆద్యాత్మిక భావాలు పెంపొందించి తద్వారా భగవంతుని అనుగ్రహానికి తోడ్పడతాయి అన్నారు అపాత్ర దానం పనికిరాదు ఎవరి అవసరాన్నిబట్టి వారికి ధానం ఇవ్వాలి అన్నాను ఈ కార్యక్రమంలో ఎం పి టి సి సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ ఎం సి ఎస్ అధ్యక్షుడు మొవ్వ శ్రీనివాసరావు గ్రామ ప్రముఖులు కసుకుర్తి అర్జునరావు కసుకుర్తి నరసింహారావు కసుకుర్తి నారాయణరావు మొవ్వ వేణు గోపాల్ మొవ్వ సాంబశివరావు మొవ్వ తాతారావు కసకుర్తి జవహర్లాల్ నెహ్రూ ఆళ్ళ శ్రీనివాస్ చౌదరి మైనేని సురేష్ ఆళ్ళ సత్యనారాయణ కొల్లు సత్యనారాయణ కొల్లు రమేష్ కోటేశ్వరరావు మొవ్వ వెంకటేశ్వరచౌదరి మొక్కపాటి సత్యనారాయణ పుసులూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

Owned by EDITOR and Publisher: PREM NATH THOKALA, 26/152, Buttaipet, Machilipatnam, Krishna Dist.,Printed at Sri Lakshmi Ofset Printer binders, D.no : 32-26-126/13, opp BSNL Bhavan, Chuttagunta, Vijayawada-4. ph:08672 227347.,cell 9848667347 - RNI NO: APTEL/2015/65279